కొమురవెల్లిలో బెల్టుషాపులను నిషేధించాలని ఏకగ్రీవ తీర్మానం

బెల్టుషాపులను నిషేధించాలని తీర్మానం అందజేస్తున్న దృశ్యం

కొమురవెల్లి, మే 23,ప్రభాతవార్త : మండల కేంద్రంలోని కొమురవెల్లి గ్రామ పంచాయతీలో శనివారం సర్పంచ్ గొల్లపల్లి పద్మ, ఉప సర్పంచ్ పోతుగంటి శ్రీనివాస్, వార్డు సభ్యులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామంలో పూర్తిగా బెల్టు షాపులను నిషేధించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి సి.హెచ్.కర్ణాకర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

రాష్ట్ర ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్‌గా కొమ్ము విజయ్

కొండపాక, మే 23, ప్రభాతవార్త : కొండపాక గ్రామానికి చెందిన కొమ్ము విజయ్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ డిపార్టమెంట్ వైస్ చైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయ్‌కుమార్ ఇప్పటి వరకు సిద్దిపేట జిల్లా ఎస్సీ డిపార్టమెంట్ అధ్యక్షుడిగా, రాష్ట్ర కన్వీనర్‌గా కొనసాగుతూ పార్టీని బలోపేతం చేసినందుకు ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర ఎస్సీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నన్ను రాష్ట్ర ఎస్సీ డిపార్మెర్ వైస్ చైర్మన్‌గా నియమించడానికి సహకరించిన మంత్రులు వివేక్ వెంకట స్వామి, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రబాకర్, గాడిపల్లి రఘువర్దన్‌రెడ్డికి అయన కృతజ్ఞతలు తెలిపారు.

విజయ్ కుమార్ (ఫైల్

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

రైతు అకాల మృతిలో వాస్తవం లేదు

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

కొల్చారం, మే 23 (ప్రభాతవార్త): మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్నగణపూర్ గ్రామానికి చెందిన రైతు వెంకటాపురం శంకరయ్య మృతికి సంబంధించి కొన్ని పత్రికల్లో ప్రచురితమైన వార్తల్లో వాస్తవాలు వక్రీకరించినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ స్పష్టం చేశారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ, కొల్చారం మండల తహసీల్దార్ (ఎంఆర్వో) సమర్పించిన నివేదిక ప్రకారం సంబంధిత రైతు గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యులు కూడా వెల్లడించినట్లు తెలిపారు. రైతు ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వం నిర్ణయించిన సీరియల్ విధానం ప్రకారమే కొనసాగుతోందని పేర్కొన్నారు. కొన్ని దినపత్రికలు ధాన్యం కొనుగోలు సమస్యల కారణంగానే రైతు మృతి చెందాడన్న వార్తలు పూర్తిగా అవాస్తవమని, రైతు మృతి ధాన్యం కొనుగోలు వ్యవహారంతో ముడిపెట్టి ప్రచారం చేయడం నిరాధారమని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటివరకు 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, 30,210 మంది రైతుల ఖాతాల్లో రూ.336.65 కోట్లు నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ కొనుగోలు కేంద్రాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. రైతులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ విజ్ఞప్తి చేశారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

జూనియర్ సివిల్ జడ్జ్, న్యాయమూర్తి హేమలత

రోగులతో మాట్లాతున్న న్యాయమూర్తి హేమలత

నర్సాపూర్, మే 23, ప్రభాతవార్త : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జూనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీస్ మండల్ కమిటీ చైర్మన్, న్యాయమూర్తి హేమలత పేర్కొన్నారు.శనివారం నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని న్యాయమూర్తి హేమలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మందుల లభ్యత, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. అంతేగాక వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.రోగుల పట్ల నిర్లక్ష్యం వహించడం, విధుల్లో అలసత్వం ప్రదర్శించడం సహించబోమని హెచ్చరించారు. ప్రతి రోగికి సమానంగా వైద్య సేవలు అందేలా అప్రమత్తంగా పనిచేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.ఆసుపత్రిలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, అత్యవసర సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోగుల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని న్యాయమూర్తి ఎం హిమలత స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది ఆసుపత్రి వైద్యులు సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యేలు

సంగారెడ్డి బ్యూరో మే 23, ప్రభాతవార్త :

ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ జహీరాబాద్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, కొత్త బోర్‌వెల్స్ మంజూరు చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే ఎమ్మెల్యే కోట కింద 40 శాతం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సాగునీటి ఇబ్బందులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత శాఖలతో సమన్వయంచేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. మ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ జొన్నల కొనుగోలు విషయంలో రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఎకరానికి 30 నుంచి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తు న్నప్పటికీ ప్రభుత్వం కేవలం 10 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేస్తోందని తెలిపారు. కనీసం ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చారు.కార్యక్రమలో మండల అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, తట్టు నారాయణ, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి , చింత సాయినాథ్, గోవర్ధన్ నాయక్, సర్పంచ్ హరివర్ధన్ ఉన్నారు.

జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు

కోఆప్షన్ సభ్యుల ఎన్నిక మరోసారి వాయిదా

ప్రతిపక్షాల ఆగ్రహం

జహీరాబాద్, మే 23 ప్రభాతవార్త

మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల ఎన్నిక మరోసారి వాయిదా పడటంపై ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నిక నిర్వహిస్తామని ముందుగా సమాచారంఇచ్చి సమావేశానికి పిలిచిన అధికారులు, చివరి నిమిషంలో సభను వాయిదా వేయడాన్ని వారు తప్పుబట్టారు. శనివారం నిర్వహించాల్సిన కోఆప్షన్ సభ్యుల ఎన్నికల సమావేశానికి సభ్యులు హాజరు కాగా, మున్సిపల్ చైర్మన్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన కారణంగా సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ జైత్రీరామ్ ప్రకటించారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమ నిరసనను వెల్లడించారు. గత సమావేశంలో కూడా బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు బైఠాయించి కమిషనర్‌ను నిలదీసిన విషయం తెలిసిందే.అయితే ఎన్నికల వాయిదా వెనుక అధికార కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థుల ఎంపికపై ఏకాభిప్రాయం లేకపోవడమే ప్రధానకారణమని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నాలుగు కోఆప్షన్ సభ్యుల స్థానాలకు కాంగ్రెస్ పార్టీ నుంచి 30 మందికి పైగా ఆశావహులు దరఖాస్తు చేసుకోవడంతో అభ్యర్థుల ఎంపిక సంక్లిష్టంగా మారింది. ప్రతి అభ్యర్థి తమకే అవకాశం కల్పించాలని పట్టుబడుతుండటంతో పార్టీ నాయకత్వం నిర్ణయానికి రాలేకపోతున్నట్లు సమాచారం.ఇప్పటికే కోఆప్షన్ సభ్యుల ఎంపిక అంశంపై మంత్రి, ఎంపీ, ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌లు, సెట్విన్ చైర్మన్‌తో పాటు పలువురు సీనియర్ నాయకుల స్థాయిలో సమావేశాలు జరిగినప్పటికీ అభ్యర్థుల ఎంపిక కొలిక్కి రాలేదని తెలుస్తోంది. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు తమ అభ్యర్థులను ముందుగానే ఖరారు చేసి ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి. ఇప్పటికే రెండు పార్టీల తరఫున పోటీ చేసే నలుగురు అభ్యర్థులను ప్రకటించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సమావేశాన్ని వాయిదా వేయాలని మున్సిపల్ చైర్మన్ తనకు సూచించారని, అందువల్లే సభను వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని మున్సిపల్ కమిషనర్ జైత్రీరామ్ తెలిపారు. కోఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహణ కోసం త్వరలోనే మరో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు.

జహీరాబాద్ మున్సిపాలిటీ

ఎంపికైన అభ్యర్థులతో జిల్లా అధికారులు

137 మంది యువతకు జాబ్ ఆఫర్ లెటర్లు అందజేత

సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 23, ప్రభాతవార్త : ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 8న నిర్వహించిన జాబ్‌మేళాలో వివిధ ప్రముఖ కంపెనీలకు ఎంపికైన 137 మంది అభ్యర్థులకు కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో శనివారం అడిషనల్ కలెక్టర్ పాండు జాబ్ ఆఫర్ లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. జాబ్ మేళాల ద్వారా ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలను యువతకు చేరువ చేస్తున్నామని తెలిపారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కేవలం ఉద్యోగం పొందడం మాత్రమే కాకుండా విధుల్లో క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తే మరింత మంచి అవకాశాలు వస్తాయని అన్నారు. ఉద్యోగాల్లో చేరిన యువత తమ కుటుంబాల ఆర్థికాభివృద్ధికి తోడ్పడటంతో పాటు సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం తుల్జారాం నాయక్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో హర్షిత్‌కు మెడల్

కొండపాక, మే 23, ప్రభాతవార్త : సిద్దిపేట జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక యువజన వారోత్సవాల్లో ఆరవ రోజున జరిగిన రాష్ట్రస్థాయి సిఎం కప్ పోటీల్లో కొండపాక మోడల్ స్కూల్ విద్యార్థి జప్తినాచారం గ్రామానికి చెందిన హర్షిత్‌కు శనివారం ఇన్‌చార్జి డివైఎస్ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మెడల్‌ను అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్ నాగర్జునసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులె అభినందించారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

కొమురవెల్లి, మే 23, ప్రభాతవార్త:

ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గీస బిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించి ప్రభుత్వ తీరును నిరసిస్తూ రోడ్డు పై బైటాయించి రాస్తారోకో చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని గన్నీ బ్యాగుల్లో నింపినప్పటికీ లారీలు సకాలంలో రాకపోవడంతో గన్నీ బ్యాగులకు చెదలు పడుతున్నాయన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నేటీ వరకు 40 శాతం ధాన్యం కూడా కొనుగోలు చేయలేదన్నారు రోహిణి కార్తీ వచ్చిందని వర్షాలు పడితే ధాన్యం తడిసిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతం చేయాలన్నారు. లారీల కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. రైస్ మిల్లుల యాజమాన్యాలు వర్షా కాలం దగ్గర పడ్డ కొద్ది అనేక కొర్రీలు పెడుతూ తాలు,ముక్క పేరుతో బస్తాకు రెండు నుంచి నాలుగు కిలోలు కట్ చేస్తూ రైతులను ముంచుతున్నారని తెలిపారు. ఎలాంటి కొర్రీలు లేకుండా ధాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న బిఆర్ఎస్ శ్రేణులు

15 రోజుల్లోగా ఆసుపత్రిని ప్రారంభించాలి

* లేకపోతే డిఎంహెచ్‌వో ఆఫీస్‌ను ముట్టడిస్తా
* అధికారులు,ప్రైవేట్ దవాఖానాలతో కుమ్మక్కయ్యారా?
* ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

పటాన్‌చెరు, మే 23, ప్రభాతవార్త : 15 రోజుల్లో పటాన్‌చెరు ఆసుపత్రిని ప్రారంభించకపోతే డీఎంహెచ్‌వో ఆఫీస్‌ను ముట్టడిస్తామని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి హెచ్చరించారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శనిలా పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి మారిందన్నారు. భవన నిర్మాణం పూర్తయి ఏడాది గడిచినా, వైద్య శాఖకు అప్పగించి 4 నెలలైనా ఆసుపత్రిని ఎందుకు ప్రారంభించడం లేదని ఆయన ప్రశ్నించారు. శనివారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో నిర్మించిన 200 పడకల సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారుల నిర్లక్ష్యంపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆసుపత్రి లోపలి విభాగాలను, వసతులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారులు, ప్రైవేట్ దవాఖానాలతో కుమ్మక్కయ్యారా అని తీవ్రంగా ధ్వజమెత్తారు. నిధులు ఉన్నా, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో జూలై 16, 2022న జీవో నెంబర్ 82 ద్వారా ఈ ఆసుపత్రికి రూ.184 కోట్లు మంజూరు చేశారు. జీవో వచ్చి నాలుగేళ్లు కావస్తోంది.మొత్తం రూ.184 కోట్లలో ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.45 కోట్లు, ఆస్పత్రి పరికరాల కోసం రూ. 25 కోట్లు (మొత్తం రూ. 70 కోట్లు) మంజూరు చేశారు. మిగిలిన రూ.114 కోట్లను వచ్చే 10 ఏళ్లపాటు ఆసుపత్రి నిర్వహణ ఖర్చుల కోసం కేటాయించారు. తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో వైద్య పరికరాలను సరఫరా చేయకపోవడం దారుణం అన్నారు. ఆసుపత్రి బిల్డింగ్ కట్టి ఏడాది పూర్తయింది. ఇంజనీరింగ్ విభాగం వారు ఈ భవనాన్ని హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించి 4 నెలలు గడుస్తోంది. సంగారెడ్డి జిల్లాలో 4732 పరిశ్రమలు ఉన్నాయి. అందులో మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలోనే 95 పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడి కాలుష్యంవల్ల వచ్చే వ్యాధులను నయం చేయడం కోసమే ఈ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రత్యేకంగా మంజూరు చేశారని తెలిపారు. కానీ నేడు ఇక్కడి పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షలా మారింది. అత్యవసర వైద్యం కోసం ప్రజలు ఇప్పటికీ కిలోమీటర్ల దూరంలో ఉన్న సంగారెడ్డి జిల్లా ఆసుపత్రికి, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఈ జిల్లాలోనే ఆరోగ్య శాఖ మంత్రి ఉంటారు, కానీ పటాన్‌చెరులో గవర్నమెంట్ హాస్పిటల్ ఓపెన్ కాదు. ఇంతకంటే దారుణం ఇంకొకటి ఉందా అన్నారు. ఏ ప్రభుత్వమైనా పేద ప్రజల సంక్షేమం కోసమే పనిచేయాలి కానీ ఇక్కడ అధికారుల నిర్లక్ష్యానికి పేదలు ప్రాణాలుకోల్పోతున్నారు. అన్ని సౌకర్యాలు పూర్తయినా అధికారులు ఎందుకు ప్రారంభించడం లేదు? వీరు ప్రైవేట్ దవాఖానాలతో కుమ్మక్కై ఈ హాస్పిటల్‌ను ఓపెన్ చేయడం లేదా?అనే అనుమానాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. అధికారులకు, పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, గుండె మీద చేయి వేసుకుని ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఆసుపత్రికి 58 మంది డాక్టర్లు అవసరం ఉండగా, కేవలం 48 పోస్టులు మాత్రమే సాంక్షన్‌చేశారు. ఇంకా 13 మంది డాక్టర్ల అవసరం ఉంది. ఇతర స్టాఫ్ 179 మంది అవసరం ఉండగా.. కేవలం 58 మందిని మాత్రమే సాంక్షన్ చేశారు. ఇంకా మిగిలిన 122 మంది సిబ్బందిని ఎప్పటిలోగా అపాయింట్ చేసుకుంటారు? నేను ఇక్కడికి రాజకీయం చేయడానికో, పేరు కోసమో రాలేదనీ తెలిపారు. పేద ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసి నా మనసు చలించి ఇక్కడికి వచ్చాను. రాబోయే 15 రోజుల్లోగా ఈ 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఓపెన్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. లేనిపక్షంలో స్థానికులతో కలిసి డిఎంహెచ్ఓ ఆఫీస్‌ను ముట్టడిస్తాం అని అంజిరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

నార్మల్ టెస్టులు బయటకు రెఫర్ చేస్తారా...

ఆసుపత్రికి వచ్చే రోగులు, డెలివరీకి సంబంధించిన నార్మల్ టెస్టులు కూడా బయట ప్రైవేట్ స్కానింగ్ సెంటర్స్ రెఫర్ చేస్తున్నారని మహిళలు చెప్పడంతో జిల్లా వైద్యాధికారితో ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. సోమవారం వరకు హాస్పిటల్‌ను విజిట్ చేసి నివేదిక ఇస్తామని జిల్లా వైద్యాధికారి తెలిపారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ మీటింగ్ సక్రమంగా నిర్వహించడం లేదని, కమిటీలో పదవి కాలం పూర్తియిన వారి పేర్లు పెట్టడం ఏంటి అని ప్రశ్నించారు.

వివరాలను వెల్లడిస్తున్న సీపీ రష్మీ పెరుమాళ్

24 గంటల్లో హత్య కేసును ఛేదించిన పోలీసులు

నిందితురాలి రిమాండ్ : సిపి రష్మీ పెరుమాళ్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

జిల్లాలోని అక్కన్నపేట మండలం మంచినీళ్ళ బండ గ్రామంలో కలకలం రేపిన బోయిని రాజ్యలక్ష్మీ అలియాస్ రాజవ్వ హత్య ఉదంతం దొంగతనం కాదు..కుటుంబ కలహాల నేపథ్యంలో చిన్న భార్య చేసిన హత్యగా పోలీసులు తేల్చారు. 24 గంటల్లో కేసును ఛేదించి నిందితురాలిని అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. సీపీ కార్యాలయంలో శనివారం సీపీ రష్మీ పెరుమాళ్ విలేకరులకు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన బోయిని కనకయ్య(52)కు పెద్ద భార్య రాజ్యలక్ష్మీ, చిన్న భార్య రాధలు ఉన్నారని తెలిపారు. ముగ్గురు కలిసి ఒకే ఇంట్లో నివాసిస్తున్నారని వివరించారు. ఈనెల 21న కనకయ్య హమాలీ పని నిమిత్తం కట్కూర్ గ్రామానికి వెళ్లినట్లు తెలిపారు. రాత్రి 9 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి పెద్ద భార్య రాజ్యలక్ష్మీపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి మెడలొంచి 3.5 తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లినట్లు కనకయ్యకు తెలుపగా వెంటనే చికిత్స నిమిత్తం 108లో హుస్నాబాద్‌లోని ప్రభుత్వ అసుపత్రికి తరలించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని రంగంలోకి దిగగా అసలు నిజాలు బయటపడ్డాయని తెలిపారు. కుటుంబ గొడవల నేపథ్యంలో కనకయ్య పెద్ద భార్య పెత్తనం ఎక్కవై ప్రతి దానికి చిన్న భార్యను అనుమానం వ్యక్తం చేస్తూ తిడుతున్నట్లు తెలిపారు. ఈనెల 21న రాత్రి ప్రాంతంలో పెద్ద భార్య చిన్న భార్యతో గొడవ పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో రాజ్యలక్ష్మీ నిద్రిస్తున్న సమయంలో తనతో చీటికి మాటికి లొల్లిపెట్టుకుంటుందని ఇంట్లో ఉన్న కర్రతో రాజ్యలక్ష్మీ తలపైన చిన్న భార్య రాధ తీవ్రంగా గాయపరిచి హత్య చేసినట్లు తెలిపారు. తనపై ఎలాంటి అనుమానం రాకుండ ఇంటి ముందుకు వెళ్లి పెద్ద పెద్దగా కేకలు వేస్తూ...గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనంచేసి హత్య చేసినట్లుగా తప్పుడు ప్రచారం సృష్టించిందని పేర్కొన్నారు. దీంతో నిందితురాలు బోయిని రాధను అరెస్టు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, శిక్షణ ఐపిఎస్ అధికారి అయేషా ఫాతిమా, హుస్నాబాద్ ఎసిపి సదానందం తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలకు నిప్పు పెట్టిన దుండగులు

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నిజాంపేట్, మే 23(ప్రభాతవార్త) : సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలం శాఖపూర్‌లో వ్యవసాయ భూమిలో వరి కొయ్యలకు గుర్తుతెలియని వ్యక్తి నిప్పంటించడంతో ఊరు చుట్టూ మంటలు వ్యాపించడంతో ఊరు సమీపంలో సమ్మి పోచయ్య గడ్డివాము తగిలిపోవడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో గ్రామస్తులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి ఫోన్‌లో సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బందివచ్చి పోలీసులు మంటలు అదుపులోకి తేవడంతో పెను ప్రమాదమే తప్పింది. అనంతరం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మాట్లాడుతూ.. వేసవి కాలంలో వరి కొయ్యలకు నిప్పు పెట్టరాదని మంటలు ఉవ్వెత్తున ఎగిసి పడతాయని ఒక్క అగ్గిపుల్లతో ఎంతో ప్రాణ ఆస్తి నష్టాలు జరుగుతాయన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సూచించారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

హుస్నాబాద్ రూరల్, మే 23, ప్రభాతవార్త : హుస్నాబాద్ బస్ స్టేషన్‌లో శనివారం మధ్యాహ్నం ఒక బాలుడు ఒంటరిగా తిరుగుతూ కనిపించగా, అక్కడి సిబ్బంది అప్రమత్తమై బాలుడిని తమ వద్దకు తీసుకొని విచారణ చేపట్టారు. బాలుడి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్న సమయంలో కొంతసేపటికి అతని తల్లిదండ్రులు బస్ స్టేషన్‌కు చేరుకొని, బాలుడు తమ కుమారుడేనని తెలిపారు. వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించిన అనంతరం బాలుడు నిజంగా వారికే చెందినవాడని బస్ స్టేషన్ కంట్రోలర్ మహేందర్, బస్టాండ్ సెక్యూరిటీ సిబ్బంది మహేందర్ సమక్షంలో బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడి తండ్రి గొల్లెన కుమార్ తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి గ్రామం కరీంనగర్ జిల్లాకు చెందినవారని బాలుడి పేరు గొల్లెన అనిరుధ్ అని వెల్లడించారు. ఈ సందర్భంగా బాలుడిని గుర్తించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన బస్ స్టేషన్ సిబ్బందిని స్థానికులు అభినందించారు.

బాలున్ని తల్లితండ్రులకు అప్పగిస్తున్న కంట్రోలర్

పాలిసెట్ ఫలితాల్లో సజన్‌కు స్టేట్ ఫస్ట్ ర్యాంకు

సిద్దిపేట అర్బన్, మే 23, ప్రభాతవార్త :

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో సిద్దిపేటలోని మాద్యులస్ పాఠశాలకు చెందిన విద్యార్థి రుద్రోజు సజన్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. ఈ ఏడాది జరిగిన పాలిసెట్ ఫలితా లో ఎంపిసి, ఎంబైపిసి రెండు విభాగాలలో 120/120 మార్కులు సాధించి విజయ కేతనం ఎగురవేశారు.ఈ సందర్భంగా ఎంఈవో రాజ ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ జ్యోతిరెడ్డి ర్యాంకు సాధించిన సజన్‌ను అభినందించారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేయకండి : ట్రాఫిక్ ఏసిపి శంకరరాజు

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజు.

బేగంపేట, మే23, ప్రభాతవార్త

మద్యం తాగి వాహనాలు నడపకండి.ట్రాఫిక్ నిబంధనలు పాటించండి.ప్రాణాలు సురక్షితంగా ఉంచుకోండి అంటూ తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు పిలుపు నిచ్చారు.బేగంపేట అశోక్ మై హోం ఛాంబర్‌లో ట్రాఫిక్ నిబంధనలపై శనివారం ట్రాఫిక్ అధికారులు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో (సత్యం వెంచర్ ఇంజనీరింగ్ సర్వీసెస్) ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమం మల్కాజ్ గిరి పోలీస్ కమీషర్ బి.సుమతి ఆదేశాల మేరకు ట్రాఫిక్ 1 డిసీపీ కె.రాహుల్ రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని,అలాగే కార్లలో సీటు బెల్టుధరించి ప్రయాణించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పకుండా పాటించాలన్నారు.మొబైల్ ఫోన్ల వాడకం వల్ల వారి ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంటుందని అలా చేయవద్దని ఏసీపీ సూచించారు.ఈ కార్యక్రమంలో హీరో కార్ప్‌మేనేజర్ సాదిక్ సాగర్ పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, మే 23 ప్రభాతవార్త: సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో పెండింగ్ సమస్యలను పరిష్కరించిన ఘనత తమదేనని, ప్రజలు నిరంతరం తమకు బ్రహ్మరథం పడుతున్నారని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫలమండీ డివిజన్‌లో పద్మారావు గౌడ్ శనివారం విస్తృతంగా పర్యటించి రూ. కోటి 25 లక్షల రూపాయల ఖర్చుతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. చిలకలగూడా, వెంకటేశ్వర నగర్, ఉప్పరిబస్తి, బ్రాహ్మణబస్తీ ప్రాంతాల్లో సీసీ రోడ్డు, సివరేజీ లైన్‌ల నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం నిరంతరం సాగే ప్రక్రియగా మార్చుకున్నామని, ప్రజల సమస్యలకు వెనువెంటనే స్పందిస్తామని తెలిపారు. ప్రజలు తమ అవసరాలకు సీతాఫలమండీలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ నేత రామేశ్వర గౌడ్, మాజీ కార్పొరేటర్ సామాలహేమ, వివిధ విభాగాల అధికారులు వేణు, కుశాల్, నాయకులు పాల్గొన్నారు.

పేద రోగుల సహాయకులకు అన్నదానం

అన్నదానం చేస్తున్న అసద్, అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ముజీబ్

బేగంబజార్, మే 23 ప్రభాతవార్త:

అసద్, అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యం కోసం పేద రోగులకు ఉచితంగా అన్నదానం చేశారు.ఎం.ఎన్.జె క్యాన్సర్ ఆసుపత్రి ఆవరణలో సుమారు 400 మంది పేదరోగులకు ట్రస్ట్ చైర్మన్ ,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల నుంచి పేద రోగులకు ప్రతినెల మూడు వారాలపాటు అన్నదానం చేయడం,ముఖ్యంగా ముజీబ్ తల్లిదండ్రుల పేరిట అన్నదానం చేయడం పట్ల సంతోషదాయకమన్నారు.ఈ కార్యక్రమంలో టి.ఎన్.జి.ఓ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ,కార్యనిర్వాహక అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, ఖాలేద్‌అహ్మద్, శంకర్, ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రియూనిట్ శివకుమార్,కార్యదర్శి చంద్రశేఖర్,మహ్మద్ వహీద్,మహ్మద్ ముస్తాఫా పాల్గొన్నారు.

దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు దోహదం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బిజెపి నాయకులు

గన్‌ఫౌండ్రి, మే23ప్రభాతవార్త: బాటసార్లకు చలివేంద్రాల ద్వారా దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో దోహదంచేస్తాయని తెలంగాణ రాష్ట్రబిజెపి ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయం ముందు చలివేంద్రాన్ని బిజెపి కార్యాలయ ఇన్‌చార్జ్ ఉమాశంకర్,డి.గోపాల్‌జీ,అలే బాస్కర్‌లతో కలసి ఆయనప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చలివేంద్రాల ద్వారా బాట సార్లకే కాకుండా బిజెపి కార్యాలయానికి పనినిమిత్తం వచ్చే బిజెపినాయకులు,కార్యకర్తలకు దాహార్తిని తీర్చుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈకార్యక్ర మంలో బిజెపి నాయకులు వెంకటేష్,సంజయ్‌గనాటే,ప్రయాసాని పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సిఈఓను కలిసిన ఎంప్లాయిస్ యూనియన్ నేతలు

ఆరోగ్యశ్రీ సీఈఓ హనుమంత్ కొండిబాను కలిసిన గిరి యాదయ్య

చిక్కడపల్లి మే 23 (ప్రభాతవార్త) : రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ నూతన సీఈవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జెడ్. హనుమంత్ కొండిబా ని ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య నేతృత్వంలో ఈ సందర్భంగా సీఈఓ హనుమంత్ కొండిబా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం కోసం వచ్చే పేషెంట్లు పలు సమస్యలతో మొదటగా ఆరోగ్య మిత్ర ల దగ్గరకే వస్తారని గుర్తుచేశారు. కాబట్టి క్షేత్రస్థాయిలో పేద ప్రజలకు రూపాయి ఖర్చు లేకుండా పూర్తిగా ఉచిత వైద్యం అందేలా ఉద్యోగుల సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉండాలని సూచించారు. ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతగా పనిచేసి పథకం విజయవంతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య, ఉపాధ్యక్షులు సుమన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రాజు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రత్నం, నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ఎయిర్ లైన్స్‌కాలనీ బిఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి : ఎమ్మెల్యే తలసాని

బేగంపేట మే 23,ప్రభాతవార్త

బేగంపేట ఇండియన్ ఎయిర్ లైన్స్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి జరిగిందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.శనివారం ఎయిర్ లైన్స్‌కాలనీలో మాజీ కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరితో కల్సి ఎమ్మెల్యే పర్యటించారు.స్థానికులను అడిగి సమస్యలు తెల్సుకున్నారు.డ్రేనేజీ సమస్య,గార్డెన్ నిర్వహణ సక్రమంగా లేదని,కాలనీలో పలు చోట్ల వీధిలైట్లు వెలగడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత సమస్యలపై వెంటనే స్పందించాలంటూ అధికారులను ఆదేశించారు .కమిటీ హాల్ ను విస్తరించాలని కోరగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా స్థనిక పార్క్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎయిర్‌లైన్ కాలనీ ఏర్పడిన 40సంవత్సరాలలో గతంలో ఏ ప్రభుత్వంలో కానీ,తప కంటే ముందు ఉన్న ఎమ్మెల్యేల హయాంలో జరగని విధంగా కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంలో 80శాతంకు పైగా అభివృద్ధి పనులు జరిగి ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యాయని చెప్పారు.మిగిలిన సమస్యలపై కూడా వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు.ముఖ్యమంత్రి మొండితనం వలన అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.సరైన

ఇండియన్ ఎయిర్‌లైన్స్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని.

అవగాహన,ప్రణాళిక లేకుండా జీహెచ్ఎంసీ ని మూడు కార్పోరేషన్లగా ఏర్పాటు చేయడం వల్ల అటు అధికారులు, ఇటు ప్రజలు గందరగోళానికి గురవుతున్నట్లు తెలిపారు.జీహెచ్ఎంసీ ఒక్కటే ఉన్న సమయంలో వివిధ శాఖలలో పూర్తి స్థాయి ఉద్యోగులు,సిబ్బంది లేరని, నూతన నియామకాలు చేపట్టకుండా మూడు కార్పోరేషన్లగా విడగొట్టడంతో అధికారులపై పనిభారం పడటమే కాకుండా సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో అమీర్‌పేట సర్కిల్ డీసీ సుజాత,టౌన్ ప్లానింగ్ అధికారి రాజేశ్వరి,వాటర్‌వర్క్స్ డీజీఎం అశీష్,డీఈ మహేష్,హార్టికల్చర్ అధికారి సైదులు,మాజీ కార్పోరేటర్ టి.మహేశ్వరి,నాయకులు శ్రీహరి,నరేందర్,శేఖర్,శ్రీనివాస్‌గౌడ్,కిషోర్,ఆకుల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్ చౌరస్తాలో నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై కాంగ్రెస్ ఆందోళన

చిక్కడపల్లి మే 23 (ప్రభాతవార్త) : నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి సాయి కీర్త్ (బాబ్జి) ఆధ్వర్యంలో శనివారం జవహర్ నగర్ నుండి అశోక్ నగర్ చౌరస్తా వరకు పెద్దఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. బింగి సాయి కీర్త్ మాట్లాడుతూ నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం దేశంలో విద్యా వ్యవస్థ వైఫల్యానికి అద్దం పడుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షల నిర్వహణలో జరుగుతున్న వరుస లీకేజీలు, అవకతవకలపై ప్రధాని నరేంద్ర మోదీ మోనం వీడాలని, తక్షణ మే పరీక్షా లీక్స్ పే చర్చ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. నీట్ పేపర్ పదే పదే లీక్ అవుతున్నప్పటికీ, బీజేపీ ప్రభుత్వం దీనిని కనీసం పట్టించుకోవడం లేదు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లోనే ఇవి ఎందుకు జరుగుతున్నాయి? దీనిని బట్టి చూస్తే దాల్ మే కుచ్ కాలా హై అని స్పష్టమవుతోంది" అని దుయ్యబట్టారు. బీజేపీ హయాంలో విద్యా

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ పై గాంధీనగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి సాయికీర్త్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

మాఫియా కు పూర్తి స్వేచ్ఛ లభించిందని, అందుకే దేశంలో గత ఏడేళ్లలో సుమారు 70కి పైగా వివిధ పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని ఖర్గే ఆరోపించారు. ఈ లీకేజీల కారణంగా దేశవ్యాప్తంగా దాదాపు రెండు కోట్ల మంది యువత భవిష్యత్తు నాశనమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మారిశెట్టి నరసింగ రావు, అభిషేక్ కెన్నెడీ , గుర్రం శంకర్ , నరేందర్ యాదవ్, సురేందర్, బాబురావు, వెంకటేష్, రాజేష్ తో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సంవత్సరాలుగా పారుతున్న డ్రైనేజీ నీరు..

-పట్టించుకోని అధికారులు,ప్రజాప్రతినిధులు

అత్తాపూర్ మే23 ,ప్రభాతవార్త : కాటేదాన్ నుండి గగన్‌పహాడ్ వైపు వెళ్లే ఓల్డ్ కర్నూల్ రోడ్డు మార్గంలో నిత్యం డ్రైనేజీ నీరు పారుతూ నయగరజలపాతాన్ని తలపిస్తుంది.గత కొన్ని సంవత్సరాలుగా తీవ్రమైన డ్రైనేజీ లీకేజ్ సమస్యలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న పట్టించుకునే నాథుడే కరవైయ్యాడు.నిత్యం ఈ రోడ్డు గుండ ప్రయాణం సాగించాలంటే ముక్కుమూసుకొని ప్రయాణం చేయాల్సి వస్తుంది.నిత్యం స్థానిక ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ ప్రయాణం సాగిస్తుంటారని అయిన కొన్ని సంవత్సరాల నుండి ఈ సమస్యకు పరిష్కరం చూపడం లేదని స్థానికులు ప్రజాప్రతినిధులు, అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.శనివారం డ్రైనేజీ సమస్యలను పరిశీలించిన మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి మాట్లాడుతూ... గగన్‌పహాడ్ వైపు వెళ్లే ఓల్డ్ కర్నూల్ రోడ్ అండర్‌పాస్ వద్ద గత 16 సంవత్సరాలుగా తీవ్రమైన డ్రైనేజ్ లీకేజ్ సమస్య కొనసాగుతోందని 2009లో ఈ అండర్‌పాస్ ప్రారంభమైనప్పటి నుండి ఈ సమస్య అలాగే ఉండిపోయినా, ఇప్పటి వరకు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. డ్రైనేజ్ మురుగు

నీరు జప్రధాన రహదారిపై పడుతూ ఉండటంతో తీవ్ర దుర్వాసన, దోమల పెరుగుదల, ప్రజల ఆరోగ్య సమస్యలు, ట్రాఫిక్ ఇబ్బందులు మరియు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాపోయారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారి నీటి నిల్వలు, జారిపడే ప్రమాదాలు, వాహనదారులకు ఇబ్బందులు, స్కూల్ పిల్లలు మరియు స్థానిక ప్రజలకు తీవ్ర కష్టాలు ఎదురవుతున్నాయని ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే జీహెచ్ఎంసి ,హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బి అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాడ్ చేశారు.

ఘనంగా వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ప్రారంభం

మూసాపేట, మే 23, ప్రభాతవార్త

వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని అల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలో హైదర్‌నగర్ డివిజన్ సమతా నగర్‌లో ఉన్న ఎస్ఎల్‌వీ ప్రో బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్ రావు, వికారాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్‌తో పాటు పలువురు క్రీడా ప్రముఖులు, కోచ్‌లు, నిర్వాహకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వికారాబాద్ జిల్లా నుంచి రికార్డు స్థాయిలో క్రీడాకారులు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనడం ఆనందదాయకమన్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అభివృద్ధికి అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్, కార్యదర్శి యు.వి.ఎన్. బాబు, సభ్యులు సుబ్బారెడ్డి, విజయ్‌కుమార్, పీవీఎల్ కుమార్, ఏ.వి.

బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

రమణా రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు. అలాగే అకాడమీ నిర్వాహకులు, చీఫ్ కోచ్ జయంత్, ఎం. రామ రాజు, సాయితేజలను అసోసియేషన్ ప్రత్యేకంగా అభినందించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులను గుర్తించి వారికి శిక్షణ, ప్రోత్సాహం అందించడంలో వీరి పాత్ర కీలకమని కొనియాడారు.వారి సమిష్టి కృషి ఫలితంగానే ఈ ఏడాది ఏకంగా 530 మంది క్రీడాకారులు ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడం గర్వకారణ మని పేర్కొన్నారు. ఈ స్థాయిలో పాల్గొనడం వికారాబాద్ జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడ పట్ల పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనమన్నారు.

కాంగ్రెస్ బాగ్ లింగంపల్లి అధ్యక్షుడిగా నవీన్ నాయక్

చిక్కడపల్లి మే 23 (ప్రభాతవార్త) : కాంగ్రెస్ పార్టీ బాగ్ లింగంపల్లి డివిజన్ కమిటి నూతన అధ్యక్షుడుగా నవీన్ నాయక్ నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడు మందడి అనిల్ కుమార్ యాదవ్ శనివారం నవీన్ నాయక్ కు నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ అనీల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలనీ సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందించడానికి కృషి చేయాలని, అదే సమయంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలన్నారు. నవీన్ నాయక్ మాట్లాడుతూ కార్యకర్తలతో మమేకమై స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నించడం ద్వారా కాంగ్రెస్ పటిష్టత కోసం కృషి చేస్తానని చెప్పారు. డివిజన్ కమిటి అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ అనీల్ కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దీపక్ జాన్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్ లకు నవీన్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. పూర్తి స్థాయి డివిజన్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకుని కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిబద్ధతతో పని చేస్తామని చెప్పారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన వడ్డెర సంఘం నేతలు

వేంనరేందర్‌రెడ్డితో మైసయ్య, శేఖర్, లోకేష్ తదితరులు

హైదరాబాద్, మే 23,ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపీ మాజీ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ ఔ అధ్యక్షులు దండుగుల మైసయ్య , జాతీయ కార్యదర్శి మక్కల శేఖర్ , జాతీయ యువజన అధ్యక్షులు డా. లోకేష్ వేముల ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం సిఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా వడ్డెర కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించినందుకు వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, కార్పొరేషన్‌కు వెంటనే నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేయాలని వడ్డెర సమాజానికి ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామచంద్రనాయక్ ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలను పెంచడం హర్షణీయం

-ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి

హైదరాబాద్, మే 23 ప్రభాతవార్త :

తెలంగాణ రాష్ట్రంలోని కార్మికులకు కనీస వేతనాలను పెంచుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి అన్నారు. రాష్ట్రంలో గత 12 సంవత్సరాలుగా వేతన సవరణ జరగకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. శనివారం అంబర్‌పేట్, డిడి కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా అరకొర వేతనాలతో కార్మికులు తెలంగాణ రాష్ట్రంలో పనిచేయలేక ఇతర రాష్ట్రాలకు తరలివెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కొరతతో ఇప్పటికే చాలా కంపెనీలు మూతపడ్డాయని, ఉన్న కొద్ది కంపెనీల ఉత్పత్తి కూడా తగ్గిపోయిందన్నారు. ఈ పరిణామాలు దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. కార్మికుల గొంతుకగా నిలిచే ట్రేడ్ యూనియన్లను రద్దు చేసి గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులను, వారి హక్కులను కాలరాసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సిఎం కెసిఆర్ తన నియంతృత్వ పోకడలతో కార్మిక వ్యతిరేక పరిపాలన కొనసాగించారని విమర్శించారు. రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై తానే ముఖ్యమంత్రితో స్వయంగా సంప్రదింపులు జరిపి వేతన సవరణ చేసే విధంగా కృషి చేశానని తెలిపారు. చట్టపరంగా ప్రతి రెండు మూడేళ్లకు ఒకసారి వేతన సవరణ చేసి, కార్మికుల సంక్షేమానికి తోడ్పాటు అందించాలని సంజీవరెడ్డి కోరారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ వేతన సవరణ కార్మికులకు నేరుగా చేరే విధంగా చర్యలు తీసుకోవాలని, మధ్యలో కమీషన్లు దండుకుంటున్న దళారీ వ్యవస్థను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ వేతన సవరణతో 1.10 కోట్ల మందికి లాభం చేకూరుతుందని తెలిపారు. మున్సిపల్, జల మండలి, ఔట్ ఉద్యోగులకు కూడా వేతన సవరణ చేపట్టాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన లేబర్ కోడ్ అమలు చేసి కార్మికుల హక్కులను కాలరాస్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం వేతన సవరణ చేపట్టి కార్మికులకు అండగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్‌యాదవ్ రాష్ట్ర కోశాధికారి జగన్ మోహన్ రెడ్డి తదితరులు పాలొని మాట్లాడారు.

ఐఎన్‌టియుసి సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, చిత్రంలో మొగుళ్ళ రాజిరెడ్డి, ఆర్.డి.చంద్రశేఖర్ తదితరులు

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి : మన్నే గోవర్ధన్ రెడ్డి

జూబ్లీహిల్స్, మే 23, ప్రభాతవార్త:

ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి కోరారు. బంజారాహిల్స్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మన్నె గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలతో డిజిటల్ పద్ధతిలో ఈ ఏడాది సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారన్నారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు సభ్యత్వ నమోదు అంశాన్ని పర్యవేక్షించడం కోసం ఇన్చార్జిలను నియమించారన్నారు. ఈ విషయంలో ఎవరూ గందరగోళానికి గురికావొద్దని సూచించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు ఇంచార్జిగా ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌ను నియమించారన్నారు. అన్ని డివిజన్‌లకు సంబంధించిన సీనియర్ నేతలు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి.

గతంతో పోలిస్తే నియోజకవర్గంలో బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో ఆదరణ పెరిగిందని దానికి అనుగుణంగా సభ్యత్వ నమోదు చేయించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సభ్యత్వ నమోదు ఇంచార్జ్ శ్రవణ్‌తో కలిసి విధివిధానాలు ఖరారు చేసి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు రామచందర్, జలాల్, కత్తాల్, హైమద్, శంకర్, నాగరాజ్, ధనరాజ్, శశిరాజ్ పాల్గొన్నారు.

దేవి దేవాలయంలో అఖండ తాళసప్తాహం

- నిరంతరాయంగా తాళం ..భక్తిపారవశ్యంలో భక్తజనం

మెడలో తుంబురా వేసుకొని తాళాలు మోగిస్తూ భజన చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు ప్రమోద్ కుమార్ కార్వాంకర్ దంపతులు

చాంద్రాయణగుట్ట, మే 23, ప్రభాతవార్త : అధిక జేష్ఠ (పురుషోత్తమ) మాసాన్ని పురస్కరించుకొని చాంద్రాయణగుట్ట శ్రీ దేవి దేవాలయ ఆవరణలోని శ్రీ పంచాయతన బాల విశ్వేశ్వర స్వామి ప్రాంగణంలో పాండురంగ విఠలేశ్వర్ అఖండ 34వ తాళసప్తాహ మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైయ్యింది. గ్రామ పురోహితులు గోళ్ళ నరహరి శర్మ, ఎ.విజయ్ కుమార్ల ఆధ్వర్యంలో గణపతి పూజ, కంకణ బంధనం, అఖండ దీపారాధన, నవగ్రహారాధన, తాళమృదంగాది పూజ, భాగవత పూజ, పాండురంగ విఠలేశ్వరుని పూజ, పంచాయతన బాల విశ్వేశ్వరుని రుద్రాభిషేకం, భాగవత పారాయణం, కుంకుమార్చన, అన్న పూజలు చేపట్టారు. ఈ పూజా కార్యక్రమాలలో సమీప బస్తీల ప్రజలతోపాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఆ తరువాత అఖండ తాళ భజన ప్రారంభమైయ్యింది. కేశవగిరి కుమ్మరి భక్త సమాజం, లక్ష్మమ్మ భక్త సమాజం, కేశవగిరి మహిళ భక్త భజన మండలి, గౌడ సంఘం మహిళా మండలి, కేశవగిరి మహిళా భక్త సమాజం, కుమ్మరి సంఘం మహిళా మండలి, కేశవగిరి చిటికెల భజన, శ్రీ కనకదుర్గ భక్త సమాజం, సంత్ ఏక్‌నాథ్ భజన మండలి, కేశవగిరి శివశక్తి భక్త సమాజం, శివకేశవ భక్త సమాజం, గంగాధర భక్త సమాజంలచే భజన కార్యక్రమాలు జరిగాయి. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ అఖండ తాళ సప్తాహం ఈనెల 30వ తేదీ శనివారం వరకు జరుగుతుంది.

ఉచిత నీటిని ఇవ్వాలని జలమండలి ఎండికి వినతి

జల మండలి ఎండికి వినతిపత్రం ఇస్తున్న ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రతినిధుల దృశ్యం.

నార్సింగి, మే 23 ప్రభాతవార్త : గ్రేటర్ హైదరాబాద్‌లో కలిపిన కొత్త వార్డులకు రోజుకు 20.వేల లీటర్ల ఉచిత మంచి నీటిని సరఫరా చేయాలని కోరుతూ బండ్లగూడ, హైదర్షాకోట్, కిస్మత్‌పూర్ డివిజన్లలోని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రతినిధుల బృందం శనివారం జల మండలి ఎండి అశోక్‌రెడ్డికి వినతిపత్రంను అందజేసింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షులు వినయ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌బాబు మాట్లాడుతూ కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రిజర్వాయర్లలోకి నీటిని సరఫరా చేయకపోవడంతో అవి పడావు పడ్డాయన్నారు. వీటిలోకి జల మండలి అధికారులు నీటిని నింపి సరఫరా చేస్తే వేసవిలో ప్రజల నీటి ఇబ్బందులు దూరం అవుతాయన్నారు. బండ్లగూడ, హైదర్షాకోట్, కిస్మత్‌పూర్ డివిజన్ల పరిధిలో నీటి సరఫరా సరిగ్గా జరుగడం లేదని, ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇళ్లల్లోని బోర్లు ఎండిపోయి,వాడుకునే నీటికి సైతం ప్రజలు అల్లాడిపోతున్నారని, వాటర్ ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారని, జల మండలి నీరు ఐదు రోజులకు ఒకసారి మాత్రమే వస్తున్నాయని ఎండి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. మేము అందజేసిన వినతిపత్రంను జల మండలి ఎండి అశోక్‌రెడ్డి చదివి సానుకూలంగా స్పందించారని వివరించారు. ఈ విషయంను సీఎంఓ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారని, వినియోగంలో లేని రిజర్వాయర్లను తనిఖీ చేసి వినియోగంలోకి తీసుకు వస్తామని ఎండి హామీనిచ్చారని ఫెడరేషన్ ప్రతినిధుల బృందం వివరించింది. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఫెడరేషన్ ఉపాధ్యక్షులు నదీమ్, కార్యవర్గ సభ్యులు విజయ్, పద్మనాభన్, రవిరాజా తదితరులు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో హిట్ అండ్ రన్

- ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

జూబ్లీహిల్స్, మే 23, ప్రభాతవార్త:

బంజారాహిల్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల సందర్భంగా ఓ ఆటో డ్రైవర్ హిట్ అండ్ రన్ చేసి పారిపోయాడు. ఈ సంఘటనలో ట్రాఫిక్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడటంతో అతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 14లోని టీజీ స్టడీ సర్కిల్ సమీపంలో శుక్రవారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా అర్ధరాత్రి దాటిన తరువాత 12.05 గంటల ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అటుగా వచ్చిన ఒక ఆటో డ్రైవర్ వేగంగా వస్తుండటాన్ని గమనించి అక్కడే తనిఖీలు నిర్వహిస్తున్న 2010 బ్యాచ్‌కు చెందిన పోలీసు కానిస్టేబుల్ బి. శంకర్ ఆటోను నిలువరించేందుకు ప్రయత్నించాడు. ఆటో డ్రైవర్ అంతే వేగంగా ఆటోను నిలుపకుండా కానిస్టేబుల్‌ను బలంగా ఢీకొట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయలవ్వడంతోపాటు అతని కాలు విరిగిపోయింది. అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు ఒకవైపు ఆటోను పట్టుకొనేందుకు ప్రయత్నించగా మరికొందరు గాయపడిన కానిస్టేబుల్‌ను హుటాహుటిన యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయనకు శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. గాయపడిన కానిస్టేబుల్ ఆరోగ్యపరిస్థితి ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు. ఈ సంఘటనపై ట్రాఫిక్ పోలీసులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రీన్ కలర్ ఆటోగా గుర్తించి స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జూబ్లీహిల్స్‌లో పబ్‌లో అర్ధరాత్రి గొడవ...కేసు నమోదు

జూబ్లీహిల్స్, మే 23, ప్రభాతవార్త:

జూబ్లీహిల్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఓ పబ్‌లో జరిగిన చిన్న గొడవ ఉద్రిక్తతకు దారితీసింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. రోహిత్ కుమార్ జైన్ తన కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఫోర్జ్ క్లబ్ పబ్‌లో మ్యాచ్ వీక్షించేందుకు వెళ్లాడు. అక్కడ సంగీతం, డ్యాన్స్ కార్యక్రమాల మధ్య వారి గ్రూప్‌లోని మహిళలు డ్యాన్స్ చేస్తుండగా, ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వారిపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. దీనిపై మహిళల్లో ఒకరి భర్త ప్రశ్నించగా, రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ వివాదం క్రమంగా ఘర్షణకు దారితీసి పరస్పరం తోపులాటకు దిగారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు క్లబ్ బౌన్సర్లు జోక్యం చేసుకున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తుల్లో ఒకరు గాజు వస్తువును ఫిర్యాదుదారుల గ్రూప్‌పైకి విసిరారు. అది కాస్త నికిత అనే మహిళకు తగలడంతో ఆమెకు రక్తస్రావ గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిఫిన్ సెంటర్‌లో చట్నీ వివాదం.. యజమానిపై కత్తితో దాడి

పేట్ బషీరాబాద్, మే 23, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్‌లోని జై భవాని టిఫిన్ సెంటర్ ఎదురుగా ఉన్న కేపీఎన్ ఫ్రెష్ టిఫిన్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పేట్ బషీరాబాద్ పోలీసుల వివరాల ప్రకారం, రమేశ్వర్ శివాజీ సఖారే అనే వ్యక్తి టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. అక్కడ గత నాలుగు సంవత్సరాలుగా పార్థమేష్ అనే యువకుడు పని చేస్తున్నాడు.శుక్రవారం ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో ఓ కస్టమర్ టిఫిన్ సెంటర్‌కు వచ్చి ఎక్స్‌ట్రా చట్నీ విషయమై పార్థమేష్‌తో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో కస్టమర్ పార్థమేష్‌పై చేయి చేసుకున్నట్లు సమాచారం. వెంటనే టిఫిన్ సెంటర్ యజమాని ఇద్దరికీ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.అయితే ఆ వ్యక్తి ఆగ్రహంతో అక్కడే ఉన్న ఉల్లిపాయలు, కూరగాయలు కోసే కత్తిని తీసుకుని పార్థమేష్‌పై దాడికి ప్రయత్నించాడు. మధ్యలో యజమాని అడ్డుకోవడంతో అతనిపై కూడా కత్తితో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు.దాడి చేసిన వ్యక్తిని గోషామహల్‌కు చెందిన హరీష్‌గా గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లారీలను అడ్డుకొని ఆందోళన చేస్తున్న రైతులు, గ్రామస్తులు

ధాన్యాన్ని తరలించాలంటూ రైతుల ఆందోళన

మర్కుక్, మే 23 (ప్రభాతవార్త): మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ గ్రామం మీదుగా చేబర్తి గోడౌన్‌కు వెళ్తున్న లారీలను రైతులు, గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. అంగడికిష్టాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన ఐకెపి కొనుగోలు కేంద్రంలో రైతులు విక్రయించిన ధాన్యాన్ని సకాలంలో తరలించక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం నిల్వలు పేరుకుపోవడంతో కొనుగోలు కేంద్రాలలో అవ్యవస్థ నెలకొన్నదని ఆరోపించారు. వెంటనే ధాన్యం తరలింపు చర్యలు చేపట్టి రైతుల సమస్య లను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. గ్రామం మీదుగా ప్రభుత్వ గోడౌన్‌కు పదుల సంఖ్యలో లారీలు వెళ్లినప్పటికీ మాకు లారీలు రాకపోవడంతో ధర్నా చేపట్టామన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి లారీల ద్వారా సకాలంలో ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సిఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

సిఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఆంక్షరెడ్డి

గజ్వేల్, మే 23 (ప్రభాతవార్త): రాష్ట్ర ప్రభుత్వం 1 కోటి 11 లక్షల మంది కార్మికులకు కనీస వేతనాలు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకోవడం పట్ల శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డి, కార్మిక మంత్రి వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అందులో భాగంగానే కార్మికులకు వేతనాలు పెంచడం జరుగుతుందన్నారు. జూన్ 1వ తేదీ నుంచి వేతనాల పెంపు అమలులోకి రావడం శుభపరిణామమన్నారు. ఈకార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, కౌన్సిలర్లు గుంటుకు శ్రీనివాస్, రమేష్, కొండల్ రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండి.షరీఫ్, వివిఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, తంజుముల్ మజీద్ కమిటీ అధ్యక్షుడు మతీన్, అజార్, జకీర్, జహీర్, మహేష్, పూజారి శ్రావణ్, గోపిశెట్టి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు వాహనాల తరలింపు

కొనుగోలు కేంద్రాలకు వాహనాలను తరలిస్తున్న దృశ్యం

దౌల్తాబాద్, మే 23 (ప్రభాతవార్త): ఖాళీగా వెళ్తున్న లారీలు, డిసిఎంలను వడ్ల కొనుగోలు కోసం ప్రభుత్వ యంత్రాంగం శనివారం తరలించారు. శనివారం ఉదయం గజ్వేల్ నుంచి చేగుంట రూట్‌లో వెళ్లే వాహనాలను తొగుట సిఐ లతీఫ్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేసి ఖాళీగా వెళ్తున్న డిసిఎంలు, లారీలను దౌల్తాబాద్ మండలానికి 6, రాయపోల్ మండలానికి 6 తరలించారు. ఈసందర్భంగా సిఐ లతీఫ్ మాట్లాడుతూ రైతులు అధైర్య పడవద్దని, ఆరబోసిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించేందుకు వాహనాలను పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్, రాయపోల్ ఎస్ఐలు అరుణ్‌కుమార్, మానస, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, దౌల్తాబాద్ ఆర్ఐ నాగరాజు, రాయపోల్ ఐకెపి ఏపిఎం యాదగిరి, ఐకెపి సిసిలు బాల్‌రాజు, రాజేశ్ తదితరులు ఉన్నారు.

ధాతృత్వాన్ని చాటుకున్న క్లాస్‌మేట్స్

నంగునూర్, మే 23, ప్రభాతవార్త : వారం రోజుల క్రితం రాంపూర్ గ్రామానికి చెందిన గోపి హార్ట్‌ఎటాక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గోపి క్లాస్‌మెంట్స్ బాధిత కుటుంబానికి రూ.34 వేల ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. కార్యక్రమంలో రేపాక రవీందర్‌రెడ్డి, రంగు రమేష్, చామంతుల కనకరాజు, లింగం బస్వారాజు, రాములు, గంగుల రవి, తాళ్లపల్లి శ్రీనివాస్, గోక రాంరెడ్డి, కృష్ణమూర్తి, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీని అడ్డుకోవడం అంటే
భవిష్యత్ తరాల జీవితాలను అడ్డుకోవడమే : అత్తు

సిద్దిపేట అర్బన్, మే 23,ప్రభాతవార్త : ఫ్యూచర్ సిటీని అడ్డుకోవడం అంటే భవిష్యత్ తరాల వారి జీవితాలను అడ్డుకోవడమేనని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. జిల్లా కేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. బిఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బిఆర్ఎస్ బెదిరింపులకు పాల్పడుతుందని మండిపడ్డారు. ప్రజలను మోసం చేయడంలో బిఆర్ఎస్ ప్రధాన నాయకులకు వెన్నతో పెట్టిన విద్యా అన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్ర ఖజానాను దోచుకొని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సిద్దిపేట నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని అభివృద్ధిపై చర్చకు సిద్దామ అని సవాల్ విసిరారు. ఫ్యూచర్ సిటీలో కంపెనీలు ఫ్యాక్టరీలు వచ్చి రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల పాలు చేసిన కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను అపకుండా సిఎం రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్‌పై తప్పుడు ఆరోపణలు, విమర్శలు చేస్తే మళ్లీ సమయం వచ్చినప్పుడు బిఆర్ఎస్ నాయకులకు ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు మధు, గాయజుద్దీన్, హర్షద్, విజయ్ డానియల్, రాజిరెడ్డి, నజ్జు, సంతోష్‌గౌడ్, బాబా, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు

గజ్వేల్ బస్టాండ్‌ను వెంటనే ప్రారంభించాలి

బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, బిఆర్ఎస్ నేతలు

గజ్వేల్, మే 23 (ప్రభాతవార్త): పట్టణంలో నిర్మించిన బస్టాండ్‌ను వెంటనే ప్రారంభించాలని బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్‌లో నూతనంగా నిర్మించిన బస్టాండ్ వద్ద బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రయాణీకులు, విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లలో రూ.12 కోట్లు కెసిఆర్ మంజూరు చేసి బస్టాండ్‌ల నిర్మాణం తుది దశకు పూర్తి చేసినా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా కనీసం బస్టాండ్‌ను ప్రారంభించలేకపోయిందన్నారు. బస్టాండ్ ప్రారంభించకపోవడం వల్ల ప్రయాణీకులు, విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అసంపూర్తిగా ఉన్న ప్రజ్ఞాపూర్ బస్టాండ్‌ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులే ఉన్నాయని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పైసా పని చేయలేదన్నారు. ఇప్పటికైనా గజ్వేల్‌పై జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు దృష్టి సారించి అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.సి.రాజమౌళి, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, ఊడెం కృష్ణారెడ్డి, గోలి సంతోష్, కోట బాబు, మర్కంటి కనకసేన, దుర్గాప్రసాద్, శ్యామల మల్లేశం, ప్రతాప్‌రెడ్డి, స్వామిచారి, ఉమర్, అహ్మద్, హనుమంతరెడ్డి, మర్కంటి కనకయ్య, మద్ది నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన కమిటీ దృశ్యం

ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ అసోసియేషన్ హుస్నాబాద్ డివిజన్ కమిటీ ఎన్నిక

హుస్నాబాద్ టౌన్, మే 23, ప్రభాతవార్త : సిద్దిపేట జిల్లా ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హుస్నాబాద్ డివిజన్ ప్రైవేట్ వ్యాయామ విద్య అసోసియేషన్ కార్యవర్గ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షులు కంటే రాజు, జిల్లా కోశాధికారి వేల్పుల వెంకటస్వామి సభాధ్యక్షత వహించారు. సమావేశంలో అసోసియేషన్ బలోపేతం, ఉపాధ్యాయుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం హుస్నాబాద్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా సీహెచ్ శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులుగా అరవింద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జి.రాజిరెడ్డి, కోశాధికారిగా సీహెచ్ సంపత్, జాయింట్ సెక్రటరీ-1 గా కె. లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీ 2గా ఎస్.రాజేష్ కార్యవర్గ సభ్యులుగా వంశీ కృష్ణ, మహేష్, వంశీ, అజయ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని తెలిపారు.

కిశోర బాలికలు హెచ్‌పివి వ్యాక్సిన్ చేయించుకోవాలని

మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజుయాదవ్

నర్సాపూర్, మే 23, ప్రభాతవార్త : కిశోర బాలికలు హెచ్‌పివి వ్యాక్సిన్ వేయించుకోవాలని మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్ అన్నారు. శనివారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో కిశోర బాలికలకు హెల్త్ స్కానింగ్, హిమోగ్లోబిన్ టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్ మాట్లాడుతూ 14 నుంచి 15 సంవత్సరాల వయసుగల బాలికలు హెచ్‌పివి వ్యాక్సిన్ చేయించుకోవాలని సూచించారు. అంతేగాక కిశోర బాలికలు పౌష్టికారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సాయికుమార్, టి ఎం సి దేవపాల, స్థానిక వైద్యులు డాక్టర్ సునీత, మెప్మా ఆర్ పి లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంగతేంటి..?

-బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య

షాద్‌నగర్, మే 23, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు వేతనాలు పెంచుతూ ప్రకటన చేసింది కానీ అందులో ఉపాధికూలీల వేతనాలకు సంబంధించిన ప్రకటన లేకపోవడం విడ్డూరంగా ఉందని తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం బికెఎంయు జిల్లా ప్రధానకార్యదర్శి బుద్ధుల జంగయ్య ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన ప్రెస్ నోట్ విడుదల చేసి మాట్లాడుతూ మినిమం వేజెస్‌యాక్ట్ ప్రకారం ఎనిమిదిగంటల పనిదినాలకు 26,000 ఇవ్వాలని ఉన్న దాన్ని అమలు పరచకపోగా 16000, 15000, 14000గా వేతనాలను పెంచుతూ ప్రకటనచేయడం 20వేల వేతనం ఎవరికి ఇస్తున్నారో ఏ కేటగిరి కార్మికులకు ఇస్తున్నారో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. సోమవారం 25న పెన్షనర్స్ భవనంలో జరిగే జనరల్ బాడీసమావేశంలో ఉపాధికూలీల సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమాల కోసం బాటలువేయబోతున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జిల్లెల్ల వెంకటేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి రమేష్‌యాదవ్, ఫరూక్‌నగర్ మండల నాయకులు రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పైప్ లైన్ లీకేజీలను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికుమార్ తదితరులు

వేసవిలో మంచినీటిని వృధా చేయవద్దు

మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్

నర్సాపూర్, మే 23, ప్రభాతవార్త : ప్రస్తుత వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు మంచినీటిని వృధా చేయవద్దని మున్సిపల్ కమిషనర్ చెరుకుసాయికుమార్ అన్నారు. శనివారం నర్సాపూర్ మున్సిపాలిటీ ఒకటవ వార్డులో మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్, కౌన్సిలర్ మీనికే నరసమ్మతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో పారిశుద్ధం, వీధి దీపాల పనితీరు, మంచినీటి సరఫరా ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ చెరుకు సాయికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచినీటిని వృధాచేయకుండా పొదుపుగా వాడుకోవాలని అన్నారు. నల్లాలకు తప్పనిసరిగా ఆన్ ఆఫ్ బిగించుకోవాలని అన్నారు. అయితే ఉపయోగంలో లేని నల్లాలు గుర్తించి వాటికి ఆన్ ఆఫ్‌లు, లీకేజీలను గుర్తించి డమ్మీ వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వినీత్, సిబ్బంది ఉన్నారు.

హిందూ సమ్మేళన సభకు తరలిరండి

మాద్గుల, మే 23 ప్రభాతవార్త : మాద్గుల మండల కేంద్రంలో ఈ నెల 24న నిర్వహించనున్న హిందూ సమ్మేళన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని హిందూ సమాజ బంధువులకు సభ అధ్యక్షుడు కాసుల వెంకటేష్ పిలుపునిచ్చారు. హిందూ ధర్మం, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యంగా ఈసభను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపలోపల కులం -గడపదాటితే హిందువులం అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈకార్యక్రమా నికి యువత, మహిళలు, పెద్దలు భారీసంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. హిందూ సమాజ ఐక్యతను చాటిచెప్పే విధంగా ఈసమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ డా.భమిడిపాటి రవికృష్ణశర్మ గురుజీ పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగం చేయనున్నారని చెప్పారు. మాద్గులతోపాటు పరిసరప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాసుల వెంకటేష్ కోరారు.

ఐకెపి విఓఏల సమ్మె కొనసాగింపు..

మాద్గుల, మే 23 ప్రభాతవార్త : రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఐకెపి విఓఏల సమ్మె ప్రభావం మహిళా సంఘాల కార్యకలాపాలపై పడుతోంది. ముఖ్యంగా బ్యాంక్ లింకేజ్ రుణా లు, సంఘాల లావాదేవీలు, ప్రభుత్వ పథకాల అమలులో విఓఏల పాత్ర కీలకంగా ఉండటంతో మహిళాసంఘాల సభ్యులు ఆందోళన వ్యక్తంచేస్తు న్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విఓఏలు సమ్మె కొనసాగిస్తున్నారు. ఈసందర్భంగా మాద్గుల మండల విఓఏ అధ్యక్షుడు కట్ట ఈశ్వర్ మాట్లాడుతూ సంవత్సరాలుగా గ్రామీణ మహిళాసంఘాల అభివృద్ధికి విఓఏలు సేవలందిస్తున్నప్పటికీ, ప్రభుత్వం తమసమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కట్ట ఈశ్వర్ కోరారు. సమ్మె కొనసాగితే మహిళాసంఘాల ఆర్థిక కార్యకలాపాలు మరింత ప్రభావితమయ్యే అవకాశం ఉందని సంఘాల సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టుపురుగుల పెంపకంతో అధిక లాభాలు

-తలకొండపల్లిని సందర్శించిన ఖమ్మం జిల్లా రైతులు

తలకొండపల్లి, మే 23, ప్రభాతవార్త:

తలకొండపల్లి మండల పరిధిలోని కోరిందకుంట తండాకు చెందిన శక్రు నాయక్ సెరికల్చర్ అధికారుల సూచనలతో పట్టుపరిశ్రమతో తనకున్న 1.20ఎకరాల పొలంలో అధికలాభాలు ఆర్జిస్తుండడంతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రైతు శక్రునాయక్ పేరు మారుమోగుతుంది. అతని స్వగ్రాహం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని కోరింతకుంట తండాలో వారసత్వంగా వచ్చిన ఎకరంన్నర భూమిలో మల్బరీతోట ఏర్పాటుచేసి పట్టుపురుగుల పెంపకాన్ని నిర్వహిస్తున్నాడు. అతను నిర్వహిస్తున్న మల్బరీ తోట పట్టు పరిశ్రమను ప్రతిరోజు ఒకరు సందర్శిస్తున్నారు. శనివారం తెలం గాణ రాష్ట్రంలోని ఖమ్మంజిల్లా కొనిజర్లమండలం తనికెళ్ళగ్రామానికి చెందిన 40మంది రైతులు, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నుండి పదిమంది రైతులు అతని పొలంవద్దకు చేరుకొని అతడు నిర్వహిస్తున్న పని విధానంపై పర్యవేక్షించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతు శక్రునాయక్, జిల్లా అధికారులు, రైతులు ఉన్నారు.

తలారి నర్సింలు కుటుంబానికి అండగా ఉంటా

-ఎంపి రఘునందన్‌రావు

రాయపోల్, మే 23 (ప్రభాతవార్త): ఉమ్మడి దౌల్తాబాద్ మాజీ వైస్ ఎంపిపి తలారి నర్సింలు కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో తలారి నర్సింలు మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎంపి రఘునందన్‌రావు శనివారం వారి స్వగ్రామమైన రామారంకు చేరుకొని నర్సింలు పార్థివ దేహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబసభ్యులు అధైర్యపడవద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారివెంట స్థానిక ప్రజాప్రతినిధులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

నూతన అధ్యక్షులకు సన్మానం

నూతన అధ్యక్షులను సత్కారిస్తున్న దృశ్యం

సిద్దిపేట అర్బన్, మే 23, ప్రభాతవార్త: జిల్లా కేంద్రంలోని గణేష్ నగర్ ప్రసన్నాంజనేయస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షులుగా ఇటీవల నూతనంగా ఎన్నికైనా నందిని శ్రీనివాస్, గణేష్‌నగర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షునిగా ఎన్నికైనా గడీల శ్రీనివాస్‌లను శనివారం శాలువాలతో ఘనంగా సత్కారించారు. ట్రస్టు అధ్యక్షులు వీరబత్తిని సత్యనారాయణ, అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి చైర్మన్ చీకోటి మధుసూదన్, ట్రస్టు కోశాధికారి కూర శేష్‌కుమార్, గణేష్‌నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు యువతల రాజేశం తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దేవతల ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

నంగునూర్, మే 23, ప్రభాతవార్త : గ్రామదేవతల ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని యువ నాయకులు వంగ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాంపూర్‌లో నిర్వహిస్తున్న శ్రీపెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవంలో శనివారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలుస్తాయన్నారు. అనంతరం దేవాలయ అభివృద్ధికి రూ.10 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గోక మహిపాల్‌రెడ్డి, సంగు పురేందర్, వార్డు సభ్యులు యాదగిరి, వెంకటేష్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో ఫలితాల్లో సత్తా చాటిన హర్షవర్ధన్

కొండపాక, మే 23, ప్రభాతవార్త : మండల కేంద్రానికి చెందిన గంధమాల హర్షవర్ధన్ 2026 పాలిసెట్‌లో రాష్ట్రస్థాయిలో 1874 ర్యాంక్ సాధించినందుకు కొండపాక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం విఠల్‌నాయక్ విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం విడుదలైన పాలిసెట్ ఫలితాల్లో విద్యార్థి 104 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. కొండపాక బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించి అదేవిధంగా పాలిసెట్‌లోనూ సత్తాను చాటిన విద్యార్థి విజయానికి కారణమైన గణితం, సైన్స్ బోధించిన ఉపాధ్యాయుల నిరంతర కృషి, అంకితభావం, నాణ్యమైన బోధనే కారణమంటూ వారిని అభినందించారు.

ఐటిఐ అడ్మిషన్ల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఐటిఐ అడ్మిషన్ల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గజ్వేల్ ఆర్డిఒ చంద్రకళ

కొండపాక, మే 23, ప్రభాతవార్త : ఈ నెల 25వ తేది నుంచి ప్రారంభంకానున్న ఐటిఐ అడ్మిషన్ల వాల్‌పోస్టర్‌ను శనివారం గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు కుకునూరుపల్లి ఐటిఐ ప్రిన్సిపల్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశాల మేరకు గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో అడ్మిషన్ రిజిస్ట్రేషన్ క్యాంపులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఐటిఐలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచిత యూనిఫామ్, నెలకు రూ॥ 2 వేల స్టైపండ్ అందించడానికి సిఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరు ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళ

ఆందోళన చేస్తున్న బాధితులు

వెల్దుర్తి, మే 23, ప్రభాతవార్త : మాసాయిపేట మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన మేము కాస్ట్‌లో ఉన్న భూమిని అక్రమంగా తన పేరున ఎక్కించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ జ్ఞానజ్యోతికి వినతి పత్రాన్ని సమర్పించారు. పోతినపల్లి గ్రామానికి చెందిన బర్రె సత్తయ్య తండ్రి కీర్తిశేషులు పెంటయ్యమాదిగ గ్రామంలోగల సర్వేనెంబర్ 203లో 25 గుంటల భూమి 1993 లో మా తండ్రి కొనుగోలు చేసినాడని కాసు చేస్తూ కబ్జాలో ఉన్నామని అన్నారు. ఈ భూమిని కొద్దిరోజుల క్రితం రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేస్తున్న బర్రె బాబు అక్రమంగా మాకు తెలియకుండా తన పేరును రికార్డులో నమోదు చేసుకున్నారని అన్నారు. అధికారులు ఇట్టి విషయమై విచారణ జరిపి అక్రమంగా తన పేరును పైన నమోదు చేసుకున్న బర్రె బాబును సస్పెండ్ చేసి మాకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబం సభ్యులతో ఆందోళన నిర్వహించి తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వీరికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పరమేష్ మాదిగ. మండల ఎంఆర్పిఎస్ భాస్కర్‌మాదిగ, బాబుమాదిగ, మద్దతు ప్రకటించారు. భూమి వివాదంపై తహసీల్దార్ జ్ఞానజ్యోతిని వివరణ కోరగా సానుకూలంగా స్పందించి జరిపి తగు న్యాయం చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

శవ రాజకీయాలు చేసే సంస్కృతి బిఆర్ఎస్‌కు లేదు

బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

చిన్నశంకరంపేట, మే 23,ప్రభాతవార్త: శవ రాజకీయాలు చేసే సంస్కృతి బిఆర్ఎస్‌కు లేదని, పాలన, అభివృద్ధి, వడ్ల కొనుగోళ్ల సహా అన్ని రంగాల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైందని బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పట్లోరి రాజు అన్నారు. శనివారం చిన్నశంకరంపేటలో నిర్వహించిన స్థానిక విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడ్లు అమ్ముడుపోలేవని రైతు రాజయ్య ఆత్మహత్య చేసుకున్నాడని, ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యే అని అన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో రైతులను ఎన్నడూ ఇబ్బందులకు గురి చేయలేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో సాక్షాత్తు ఆ పార్టీ సర్పంచులే కలెక్టర్ వద్దకు వెళ్లి లారీలు రాలేదని మొరపెట్టుకున్న సంగతి మరిచిపోయారా అని ప్రశ్నించారు. రైతు రాజయ్య చనిపోతే పరామర్శించడానికే మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి వచ్చారని, అంతే కాని శవ రాజకీయాలు చేసేందుకు కాదన్నారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలు వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా ఇప్పుడు రైతుల ప్రాణాలు పోతున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎరువులు, లారీల కొరత వంటి లేకుండా చూసుకున్నామన్నారు. ఎన్నిల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర వాగ్దానాలు క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. ఎరువులు విషయంలో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోన్నారన్నారు. లారీలు సక్రమంగా రాకపోవడంతో ఆకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా వడ్లను కొనుగోలు వేగవంతం చేయాలని వారు డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగా నరేందర్, కుమార్ గౌడ్, లక్ష్మారెడ్డి, సత్యంగౌడ్, శ్రీనివాస్, పోచయ్య, ప్రభాకర్, శ్రీనివాస్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, ఇమ్మడి నరేష్, అత్తిలి నాగరాజు, లాలు నాయక్, వెంకట్‌రాంరెడ్డి, రాజు, గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

WANTED

★ STERLING MODEL School, English Medium, Kallakal-near Medchal.Wanted Qualified lady Teachers, Assistants for all subjects. Ph:8019130160.
(Ro.No: 1441)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవల సిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

ఎంఇవో ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందచేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజేశ్

జోగిపేట, మే 23, ప్రభాతవార్త: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టి.రాజేశ్, జిల్లా కార్యదర్శి సతీష్ డిమాండ్ చేశారు. శనివారం మండల విద్యాధికారి కార్యాలయంలో ఎంఇఓ ఖాళీకుర్చీకి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందోలు, జోగిపేటలో ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, కనీసం క్రీడా మైదానాలు లేవని ఆరోపించారు. అంతేగాక అర్హత కలిగిన ఉపాధ్యాయులు లేరని తెలిపారు. దీనివల్ల విద్యార్థులకు నాణ్యమైన బోధన అందటం లేదని చెప్పారు. ఫీజుల విషయంలోనూ నియంత్రణ లేదని, అడ్డగోలు ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ప్రైవేటు పాఠశాలలన్నీ కమర్షియల్ భవనాలోన్లకొనసాగుతున్నాయని, ఇది ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించటమేనని అన్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

చేయూత పెన్షనర్ల ఆధార్ అప్‌డేట్

హద్నూర్ పంచాయతీలో ఆధార్ వివరాలను అప్‌డేట్ చేస్తున్న దృశ్యం

న్యాల్‌కల్, మే 23, ప్రభాతవార్త: మండల పరిధిలోని హద్నూర్ గ్రామంలో చేయుత పెన్షన్‌లు అందుకుంటున్న లబ్దిదారుల ఆధార్ కార్డులను గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం అప్‌డేట్ చేశారు. పెన్షన్‌లు అందుకుంటున్నవారు ఆధార్‌కార్డులను పంచాయతీ కార్యాలయానికి చేరుకుని అప్‌డేట్ చేసుకోవాలని సర్పంచ్ ఎంఆర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి ధనరాజ్, పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌లో భారీగా చేరికలు

పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరుతున్న యువకులు

రామాయంపేట, మే 23, ప్రభాతవార్త : యువతకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ డిప్యూటీ స్పీకర్, పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం రామాయంపేటలోని పార్టీ కార్యాలయంలో అక్కన్నపేటకు చెందిన పలువురు యువకులు బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల పట్ల ఆకర్షితులై యువత స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరినవారిలో వగ్గు వంశీ, వెల్మల రేవంత్, ముత్యం రంజిత్, ముత్యం సందీప్, వగ్గు బన్ని, ముత్యం విష్ణు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, పాక్స్ చైర్మన్ బాధే చంద్రం, పార్టీ బాధ్యులు రాగి ఉమామహేశ్వర్, అక్కన్నపేట గ్రామ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షుడు రొయ్యల నవీన్, నాయకులు శ్రీకాంత్ సాగర్, మద్దూరి శ్రీనివాస్, తాటిపల్లి రాంకి, దొమ్మట్ట శ్రవణ్ గౌడ్, వెల్మల మహేశ్, బోడ శ్రీకాంత్, పాపయ్యగారి నర్సింలు, ఎల్లగారి రాజు, నాగరాజు, వంశీ సాగర్, పవన్‌సాగర్, రాఘవేంద్ర, ప్రశాంత్ సాగర్, స్వామి, సిద్దరాములు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

అమీన్‌పూర్, మే 23 ప్రభాతవార్త: అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని విలీన గ్రామాల్లో రూ.3 కోట్ల 66 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమీన్‌పూర్, బీరంగూడ ప్రాంతాల్లోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల ద్వారా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, పరిష్కారానికి ప్రణాళికా బద్ధంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ నరసింహాగౌడ్, మాజీ వైస్‌ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

నేటి సమాజానికి మార్గదర్శకం బసవ తత్వాలు : ఎంపి

నారాయణఖేడ్, మే 23 ప్రభాతవార్త : హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో అఖిల భారత వీరశైవ లింగాయత మహాసభ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆది జగద్గురు పంచాచార్య యుగమానోత్సవం, మహాత్మ బసవేశ్వర జయంత్యుత్సవంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ప్రసంగిస్తూ పంచాచార్యులు, బసవాది శరణులు మానవ ధర్మం, సమానత్వం, కాయకం మరియు దాసోహం అనే మహోన్నత సందేశాలను ప్రపంచానికి చాటిచెప్పారని ఆయన పేర్కొన్నారు. జాతి, మత, పంథ భేదాలు లేకుండా అందరూ ఒక్కటే అన్న మానవతా విలువలను ప్రతిపాదించిన బసవ తత్వాలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. సమాజ ఐక్యత, సంఘటితం, విద్యా మరియు సామాజిక అభివృద్ధి కోసం మరింత అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా సంకల్పం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత వీరశైవ మహాసభ జాతీయ అధ్యక్షుడిగా ఎంపికైన కర్ణాటక రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఈశ్వర్ కాండ్రే గారిని తెలంగాణ రాష్ట్ర శాఖ పదాధికారులు మరియు జగద్గురువులు అభినందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మహాసభ నాయకులు, మాజీ ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, సామాజిక ప్రముఖులు, అనేక మంది నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని రైతుల ఆందోళన

కోర్పోలు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన

చౌటకూరు, మే 23, ప్రభాతవార్త: మండల పరిధిలోని కోర్పోలు గ్రామంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలంటూ రైతులు శనివారం ఆందోళనకు దిగారు. కోర్పోలు నుంచి చౌటకూరు ప్లై ఓవర్ వరకు బైక్‌లపై నిరసన ప్రదర్శన చేపట్టి అక్కడినుంచి రైతులు పాదయాత్రగా తహసీల్దార్ కార్యాలానికి చేరుకుని ఖాళీ కుర్చీకి మెమోరండంను అందచేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వరికోతలు కోసి నెలరోజులు గడుస్తున్నా కోర్పోలులో ధాన్యం తూకం చేయడంలో నిర్వాహకులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో వంద లారీల ధాన్యం పండిందని, ఇప్పటివరకు 10 లారీలకు మించి ధాన్యం తూకం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీల సంఖ్యను పెంచి కొనుగోలులో వేగం పెంచుతామని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ పాండు హామీ ఇచ్చినా అమలు కావడంలేదని విచారం వ్యక్తంచేశారు. మరో పక్షం రోజుల్లో ఖరీఫ్ సీజన్ వరి తూకం సమయం ముంచుకొస్తుందని, అప్పటిలోగా కొనుగోళ్లు పూర్తి చేయాలని రైతులు డిమాండ్‌చేశారు. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి సి.దామోదర్ రాజనర్సింహాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు.

తహసీల్దార్ కుర్చీకి వినతి పత్రం అందచేస్తున్న సుల్తాన్‌పూర్ గ్రామ రైతులు

రైతుల ఆందోళనకు బిఆర్ఎస్, బిజెపి సంఘీభావం..

కోర్పోలులో రైతులు చేపట్టిన ఆందోళనకు బిఆర్ఎస్, బిజెపి నాయకులు సంఘీభావం తెలిపారు. బిఆర్ఎస్‌నేత, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి, బిజెపి నేత చంటి ప్రభు వేర్వేరుగా హాజరై మాట్లాడుతూ మంత్రి దామదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆందోలు నియోజకవర్గంలో రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతంగాన్ని పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. వద్ద కొనుగోలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. కల్లాల వద్ద రైతులు కాపాల ఉంటూ ఎప్పుడు తూకం వేస్తారోనంటూ ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున వెంటనే ధాన్యాన్ని తూకం వేసి రైసుమిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విధుల్లో లేకపోవడంతో ఖుర్చీకి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో నాయకులు బచ్చుగూడెం ప్రవీణ్ రెడ్డి, పల్లె ప్రభు కుమార్‌గౌడ్, సార రాజ్‌కుమార్, పుట్టి మోహన్‌ముదిరాజ్, చందాపురం ముకుందం ముదిరాజ్, సుధాకర్‌గౌడ్, వినోద్‌కుమార్‌గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

వెల్దుర్తి, మే 23, ప్రభాతవార్త :

మండల కేంద్రమైన వెల్దుర్తిలోని అంబేద్కర్ చేరాస వద్ద శనివారం రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల వేతనాలను పెంచిన నిర్ణయాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలోని ఒక కోటి 11 లక్షల మంది కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం గురువారం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. దీంతో కార్మికుల కార్మిక వేతనాలను పెంచిన నిర్ణయాన్ని స్వాగతిస్తూ తాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి అన్నారు. కార్మికులకు వేతనాలను పెంచిన నిర్ణయాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అలాగే సీఎం నిర్ణయాన్ని అభినందిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్, సామాన్య ప్రజలపై భారం మోపుతుందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం కార్మికుల కష్టాలను అర్థం చేసుకొని వారి వేతనాలను పెంచిందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ పేదల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందని అన్నారు. మాజీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, శేఖ గౌడ్, కృష్ణ గౌడ్, మల్లేశం, నాయకులు పవన్ యాదవ్, వెంకట్ రెడ్డి, అరికెల సత్తయ్య, దుర్గ గౌడ్, బంజే రవి, పట్టణ అధ్యక్షుడు మల్లేశం చారి, మహిళా నాయకురాలు ముక్తా బాయ్, పాండు. కిష్టయ్య కార్యకర్తలు నాయకులు భారీగా పాల్గొన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్ బిక్షపతిని సన్మానిస్తున్న ఆవుల రాజిరెడ్డి తదితరులు

జల హనుమాన్ ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తా : ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్, మే 23, ప్రభాతవార్త : మండల పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామ శివారులో వెలసిన శ్రీజల హనుమాన్ ఆలయంలో ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయిస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి హామీ ఇచ్చారు. శనివారం జల హనుమాన్ ఆలయంలో శ్రీ జలాంజనేయ స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీజ లాంజనేయ స్వామికి అభిషేకం, పంచామృతాభిషేకం సింధూర లేపనం వంటి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల జలహనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన కాటం బిక్షపతిగౌడ్‌ను ఆయన శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ జలహనుమాన్ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ముఖ్యంగా ముందుగా ఈ ఆలయానికి ధ్వజస్తంభం లేనందున త్వరలో ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన ఆలయ కమిటీ చైర్మన్ కాటం బిక్షపతి గౌడ్, మొగులయ్య గ్రామ పెద్దలు భక్తులు తదితరులుపాల్గొన్నారు.

సబ్సిడీపై జనుము విత్తనాలు

మర్పల్లి, మే 23 ప్రభాతవార్త : ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై రైతులకు జనుము విత్తనాలు పంపిణీ చేస్తుందని మర్పల్లి వ్యవసాయాధికారి శ్రీకాంత్ తెలిపారు. మర్పల్లి మండ లానికి 150 బ్యాగుల విత్తనాలు రావడం జరిందని అన్నారు. 40 కిలోల బరువుగల బ్యాగు ఎకరం పొలానికి సరిపోతుందని ప్రతి రైతుకు ఒక్క బ్యాగు మాత్రమే ఇవ్వడం జరుగుతుందని, 50శాతం సబ్సిడీ పోను 3,110 రూపాయలు చెల్లించాలని, అవసరం ఉన్న రైతులు ఆధార్‌కార్డు, పట్టా పాస్ బుక్ జిరాక్స్ తీసుకురావాలని కోరారు.

గిరిజనుల మహాధర్నాను విజయవంతం చేయాలి

లాంబాడి హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు సురేష్‌సింగ్

కంగ్టి, మే 23, ప్రభాతవార్త: గిరిజన హక్కుల సాధనకు ఈనెల 26న హైదరా బాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న మహా ధర్నాను విజయవంతంచేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు సురేష్ సింగ్ పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గిరిజనులకు 12 హామీలు చేశారని సురేష్‌సింగ్ గుర్తు చేశారు. డిక్లరేషన్‌లో చేసిన ప్రతి హామీని వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు ఉన్న 6 శాతం రిజర్వేషన్‌లను 10 శాతం గా గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సిఎం కేసిఆర్ పెంచడం జరిగిందని, హైదరా బాద్‌లో లంబాడీల ఆత్మగౌరవ భవనంగా సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ భవనాన్ని 100 కోట్లతో గత ప్రభుత్వంలో నిర్మించు కోవడం పూర్తయిందన్నారు. 56 గిరిజన భవనాలను రాష్ట్రంలోని గిరినులు ఎక్కువ ఉన్న నియోజకవర్గాల్లో నిర్మించుకోవడం జరిగిందన్నారు. తండా నుంచి గ్రామానికి అనుబంధంగా బీటీ రోడ్లను నిర్మించుకోవడం జరిగిందన్నారు. తాగునీరు లేక గిరిజన మహిళలు పడుతున్న పాట్లను గమనించి మాజీ సిఎం కేసిఆర్ మిషన్ భగీరథ ద్వారా ప్రతితండాకు, ప్రతి ఇంటికి మంచినీటిని సరఫరా అయ్యేలా చేశారని గుర్తు చేశారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు చేసిన 12 హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న నిర్వహించే మహా దర్నాకు గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని జయవంతం చేయా లని పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ రాంబల్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించే మహా ధర్నాకు లంబాడీలు, గిరిజన సంఘాలు, విద్యార్థి సంఘాలు పార్టీలకతీతంగా తరలిరావాలన్నారు.

మహాధర్నా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

రామాయంపేట మున్సిపల్ కాంప్లెక్స్‌లో

రీ టెండర్లలో భారీ అవకతవకు

బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, పట్టణ అధ్యక్షుడు అవినాష్‌రెడ్డి

రామాయంపేట, మే 23, ప్రభాతవార్త : మున్సిపాలిటీ దుకాణాల సముదాయం లీజు గడువు పూర్తయిన 13 షట్టర్ల రీటెండర్ వ్యవహారంలో భారీ అవకతవకలు జరుగుతున్నాయని బిజెపి నేతలు ఆరోపించారు. శనివారం బిజెపి కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, పట్టణ అధ్యక్షుడు అవినాష్‌రెడ్డిలు మీడియా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యవైఖరిని, పాలకవర్గ కుమ్మక్కును తీవ్రంగా ఎండగట్టారు. రాగి రాములు మాట్లాడుతూ లీజు కాలం ముగిసినప్పటికీ రీటెండర్ నోటిఫికేషన్ జారీ చేయకపోవడం వల్ల మున్సిపాలిటీకి మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల ఆదాయ నష్టం జరుగుతోందని మండిపడ్డారు. తూప్రాన్ పట్టణంలో దుకాణాల బహిరంగ వేలానికి చర్యలు తీసుకుంటున్న అదే కమిషనర్ రామాయంపేట విషయంలో మాత్రం తాత్సారం చేయడం అనుమానాస్పదంగా ఉందన్నారు. గత లీజుదారులతో కుమ్మక్కై, కొందరు స్వార్థ రాజకీయ నాయకుల ఒత్తిడికిలోనై వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఆ షటర్లకు మున్సిపాలిటీకి వచ్చే నెలవారీ అద్దె కేవలం 2 వేల నుంచి 5 వేల రూపాయలేనని, అదే లీజుదారులు వాటిని ఇతరులకు 20 వేల నుంచి 30 వేల రూపాయల వరకు కిరాయికి ఇచ్చి భారీ లాభాలు పొందుతున్నారని సంచలన విషయాలు బయటపెట్టారు. ప్రస్తుతం లీజులో ఉన్నవారంతా వ్యాపారవేత్తలే తప్ప పేదలు కాదని స్పష్టం చేశారు. ఈ తంతు వల్ల మున్సిపాలిటీకి కోట్ల ఆదాయానికి గండి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరువురు నేతలు సంయుక్తంగా డిమాండ్ చేస్తూ వెంటనే రీ టెండర్ ప్రక్రియ ప్రారంభించి బహిరంగ వేలం నిర్వహించాలన్నారు. రామాయంపేట అభివృద్ధికి ఉపయోగపడే 4 కోట్ల ఆదాయాన్ని సాధించేందుకు చైర్మన్, అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ తక్షణ చర్యలు తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో అన్ని దుకాణాలను మూసివేస్తామని, మున్సిపల్ కార్యాలయాన్ని దిగ్బంధం చేసి భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని, స్వార్థ రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రయోజనాల కోసం పనిచేయాలని సూచించారు. ఈ వ్యవహారం వెనుక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయో త్వరలోనే ప్రజల ముందుంచుతామని వారు తెలిపారు.

మాట్లాడుతున్న బిజెపి నాయకులు

లారీల సమస్యను పరిష్కరించాలి

-రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాజ్

పుల్‌కల్, మే 23, ప్రభాతవార్త: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల సమస్యను పరిష్కరించాలని ంతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి జయరాజ్ డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో శనివారం పుల్‌కల్ మండలం గొంగ్లూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. జిల్లా వ్యాప్తంగా లారీల కొరత, రవాణ సమస్య రైతులను వేదిస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పుర్రర మల్లారెడ్డి, సిఐటియు ప్రాంత కార్యదర్శి డి విద్యాసాగర్, నాయకులు విఠల్, ఏర్పుల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను వెలికి తీసేందుకే సమ్మర్ క్యాంపులు...

పాపన్నపేట, మే 23, ప్రభాతవార్త : విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలు వెలికి తీసేందుకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆచరణ ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు ప్రవీణ్, నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కొడుపాక ఉన్నత పాఠశాలలో ట్రస్ట్ తరపున సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు రెండు రోజుల పాటు పాఠశాలలో క్రీడలు, కెరీర్ గైడెన్స్, విద్య ప్రాముఖ్యత, నైతిక విలువలు, సృజనాత్మకత, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర విషయాలపై అవగాహన పెంపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి నాయుడు, గ్రామ సర్పంచ్ పంకజ కాశినాథ్, పీఇటి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పక్షపాతి : ఆవుల రాజిరెడ్డి

సీఎం, మంత్రి చిత్రపటాలకు పలాభిషేకం చేస్తున్న ఆవుల రాజిరెడ్డి

హత్నూర, మే 23, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పక్షపాతి అని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం హత్నూర మండలం గుండ్ల మాచ్నూర్ గ్రామం పంచాయతీ పరిధిలోని పారిశ్రామికవాడలో సీఎం రేవంత్ రెడ్డి కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ల చిత్రపటానికి పాలాభిషేకం చేసేందుకు నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో గుండ్లమాచనూరు సర్పంచ్ బి శ్రీహరి, పార్టీ రాష్ట్ర మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ హకీమ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్రే కృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్గారెడ్డి, ఆకుల కిష్టయ్య, విజయభాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, చార్ల మణిదీప్, రంజిత్ రెడ్డి, వరిగుంతం కృష్ణ,ఎం కృష్ణ, చార్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించండి

ఎంపిడివో శంకర్

చౌటకూరు, మే 23, ప్రభాతవార్త: ఉపాధి కూలీలకు క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపిడిఓ కె.శంకర్ సూచించారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో పెద్ద చెరువులో చేపడుతున్న ఫిష్‌పాండ్ పనులను ఎంపిడిఓ శంకర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ శంకర్ మాట్లాడుతూ ఎండలు మండుతున్నందున కూలీలు ఉదయం వేళలో పనులు పూర్తి చేసుకునేలా చూసుకోవాలని సూచించారు. పనుల వద్ద తాగునీరు, నీడ, ప్రథమచికిత్స తదితర మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. సర్పంచ్ చంటి గీతారాణి రమేష్ ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందచేశారు. కార్యక్రమంలో ఉపాధి హామి పథకం ఏపిఓ రామ్మోహన్, పంచాయితీ కార్యదర్శి పావని పాల్గొన్నారు.

కార్మికులకు అంబలి పంపిణీ

జిన్నారం, మే 23, ప్రభాతవార్త : బొల్లారం జీహెచ్ఎంసీ 272 డివిజన్‌లో ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న కార్మికులు, ప్రయాణికుల కోసం బీజేపీ పట్టణ అధ్యక్షుడు కేజీఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి చల్లని అంబలి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బీజేపీ కార్యాలయం ఎదుట స్వయంగా అంబలి తయారు చేసి ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల్లో పనిచేసే పేద కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ఎండల్లో బయటకు వెళ్లేటప్పుడు హెల్మెట్, టోపీ ధరించాలని సూచించారు. ప్రజల కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.

29 నుంచి పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన

చౌటకూరు, మే 23, ప్రభాతవార్త: మండల పరిధిలోని శివంపేట పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ 2026 అడ్మిషన్లకు సంబంధించిన ధృవ పత్రాలను ఈ నెల 29వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు పరిశీలన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సూర్యనారాయణ ఒక ప్రకటలో తెలిపారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసి ర్యాంకు పొందిన విద్యార్థులు మీ సేవ, ఆన్‌లైన్ కేంద్రాలు, సొంతంగా కంపూటర్లలో ఈ నెల 27 నుంచి 31వ తేదీవరకు ఏదేని ఒక రోజు స్లాట్‌బుకింగ్ చేసుకోవాలన్నారు. స్లాగ్ బుకింగ్ చేసుకున్న విద్యార్థులు సమయానికి శివంపేట పాలిటెక్నిక్ కళాశాలకు ఒక గంట ముందుగా పాలిటెక్నిక్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, నాల్గవ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదవిని స్టడీ సర్టిఫికెట్లు, పదవ తరగతి ఉత్తీర్ణత మెమో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కుల, ఆదాయ ధృవపత్రాలు, టిసిలతో హాజరు కావాలన్నారు. ఈడబ్లుఎస్ కోటా కింద ధరఖాస్తు చేసుకున్న ఓసివిద్యార్థులు ఈడబ్లుఎస్ ఆదాయధృవపత్రాలను అందచేయాలన్నారు.

మల్లారంలో చెత్త బుట్టల పంపణీ

చిన్నకోడూరు, మే 23, ప్రభాతవార్త : ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడివో జనార్ధన్ అన్నారు. మండల పరిధిలోని మల్లారంలో శనివారం సర్పంచ్ లింకలపల్లి హరీష్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు చెత్త బుట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అమరవీరుల స్థూపానికి మరమ్మతులు చేపట్టాలి

గుమ్మడిదల, మే 23, ప్రభాతవార్త : సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద ఉన్న 1969 తెలంగాణ అమరవీరుల స్తూపం ప్రస్తుతం నిరక్ష్యానికి గురై దయనీయస్థితిలో ఉందని కుల రాజ్యాధికార పార్టీ కూటమి పొలిట్ బ్యూరో సభ్యుడు వడ్డే ఎల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గుమ్మడిదలలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్మారక చిహ్నాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఇటీవల పొలిట్‌బ్యూరో సభ్యులు బి.ఎన్.జాంబావ, బెల్లి చంద్రశేఖర్ యాదవ్, ముక్క ప్రభాకర్ మాదిగ, బద్దుల అఖిల్ చంద్ర కలిసి సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద ఉన్న అమరవీరుల స్తూపాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారని తెలిపారు. స్తూపం చుట్టూ సరైన నిర్వహణ లేకపోవడం, మరమ్మత్తులు అవసరమైన పరిస్థితి ఉండటం పట్ల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారని చెప్పారు. జూన్ 2వ తేదీలోపు ప్రభుత్వం స్పందించి స్తూపానికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, ప్రాంగణంలో శాశ్వత భద్రతా సిబ్బందిని నియమించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలను గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రభుత్వం ఆలస్యం చేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు చేపడతామని వడ్డే ఎల్లయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో మాలల హక్కుల సాధన సమితి వ్యవస్థాపకుడు బొమ్మల మైసయ్య, ప్రచార కార్యదర్శి ఆకుల పెంటయ్య, మాల మహా రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు కొంగర నరహరి, ప్రధాన కార్యదర్శి నీరుడి శ్రీనివాస్, వడ్డేర రాజ్యాధికార పార్టీ ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వడ్డే ఎల్లయ్య